క్లుప్తంగా

పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్ల అందజేత



ఫ్యాన్లను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వెంకటాపురం(కె) : తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ఏదో విధంగా సహాయం చేయాలనే సంకల్పంతో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు పూర్వ విద్యార్థులు ఫ్యాన్స్‌ను అందజేశారు. పాఠశాలలో 1998–99 లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం 15 సీలింగ్ ఫ్యాన్స్ పాఠశాల హెచ్ఎం, మండల విద్యాశాఖ అధికారి జీవీవీ సత్యనారాయణకు అందజేశారు. అందజేసిన వారిలో పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు ఉన్నారు.

మ్యాచింగ్ సెంటర్‌లో చోరీ

ములుగు రూరల్ : జిల్లాకేంద్రంలోని పత్తిపల్లి రోడ్డులో శ్రీలక్ష్మీ మ్యాచింగ్ సెంటర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షాపు యజమాని షాపు తెరిచి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో కౌంటర్ పరిశీలించగా అందులో రూ. 6 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి యజమాని మాట్ల సంపత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు.

బాధ్యులపై చర్య తీసుకోవాలి

ములుగు రూరల్ : డీఆర్‌డీఏలు శ్రీనిధి సిబ్బందిచే భారీ అవకతవకలకు సంబంధించిన విచారణ ఫైల్ గుర్తించి బాధ్యులపై చర్య తీసుకోవాలని డీఆర్‌డీఏ మాజీ ఉద్యోగి అరుణ్‌సింగ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా అరుణ్‌సింగ్ మాట్లాడుతూ ములుగు, తాడ్వాయి, వెంకటాపురం(ఎం) మండలాల్లో 21 గ్రామాఖ్య సంఘాల్లో జరిగిన రూ.2 కోట్ల అవకతవకలపై జరిగిన విచారణ ఫైల్‌ను ఆర్టీ చట్టం కింద అందించాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశానని అన్నారు. అధికారులు ఫైల్ అందుబాటులో లేదని సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. అవకతవకలకు సంబంధించిన ఫైల్ నివేదిక కారణంగా ఉద్యోగం కోల్పోయానని తెలిపారు.

పీరీల నిమజ్జనం

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని మసీద్ వద్ద పీరీలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో డప్పుచప్పుళ్లతో ఊరేగించారు. సోమవారం మసీద్ వద్ద ప్రత్యేక పూజల అలంకరణ అనంతరం సమీపంలోని జంపన్నవాగులో నిమజ్జనం చేశారు. అనంతరం మసీద్‌వద్ద అగ్నిగుండాలను ఏర్పాటు చేయగా మొక్కుబడి ఉన్న భక్తులు వాటిలో నుంచి నడుచుకుంటూ వెళ్లి వారి భక్తిని చాటుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వాజేడు : మండలంలోని చెరుకూరు గ్రామం వద్ద సోమవారం కంటైనర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ధర్మవరం నుంచి చెరుకూరుకు ద్విచక్ర వాహనంపై వాసం రత్తమ్మ, వాసం ప్రసాద్ వస్తున్నారు. చెరుకూరుకు రాగానే ఎదురుగా వస్తున్న కంటైనర్‌ను ఢీ కొని కిందపడ్డారు. దీంతో రత్తమ్మ కాలు విరగగా, ప్రసాద్ కాలు చిట్లినట్లు తెలిసింది. 108 అంబులెన్స్‌లో ఏటూరునాగారం నుంచి ములుగుకు తరలించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

వెంకటాపురం(కె): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సోడి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎస్ఎఫ్ఐ ఆ టద్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ మల్లేశంకు వినతిపత్రం అందజేశారు. అశోక్ మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యార్థులను ప్రైవేట్ యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు.

అపస్మారక స్థితిలో మహిళ

ములుగు రూరల్ : అపస్మారక స్థితిలో రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ బెంచీపై ఓ మహిళ పడుకొని ఉన్న సంఘటన తాడ్వాయి మండలం ఊరట్టం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మల్లంపల్లి గ్రామానికి చెందిన పల్లెబోయిన సుజాత పోస్టాఫీస్‌లో విధులు నిర్వహిస్తోంది. తన భర్త రాజు కొంత కాలం క్రితం మరణించాడు. అప్పటి నుంచి తల్లిగారి ఇంటి వద్ద ఉంటూ ఉద్యోగం చేసుకుంటుంది. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఊరట్టం వెళ్లి ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తన మిత్రులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. గ్రామస్తులు గమనించి 108కి సమాచారం అందించి ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మూగజీవాలకు వైద్యం అందేనా ?

- పశువులు జబ్బుపడితే ప్రైవేట్ వైద్యులే దిక్కు
- లైవ్ స్టాక్ అసిస్టెంట్ బదిలీ
- ఇన్‌చార్జ్ వైద్యులు కన్నెత్తి చూడని వైనం



మండల కేంద్రంలోని పశువైద్యశాల

కన్నాయిగూడెం : మండలంలోని మూగ జీవాలకు వైద్యం అందని ద్రాక్షలా తయారైంది. మండలంలో ఏడాది నుంచి డాక్టర్ లేకుండా కొనసాగుతోంది. ఇక్కడా పనిచేస్తున్న లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లాడు. అప్పటి నుంచి మూగ జీవాలకు వైద్యం అందడం లేదు. అందుబాటులో ఉన్న అటెండర్ విషయం చెప్పి టాబ్లెట్ ఇచ్చి పంపుతున్నారు. కన్నాయిగూడెం పూర్తిగా వ్యవసాయ ఆధారిత మండలం కావడంతో ఎక్కువగా గో ఆధారిత వ్యవసాయం పైనే ఆధారపడి సేద్యం సాగుతుంది. గేదెలు, పశువుల, మేకలు, పెరటి కోళ్ల పెంపకాలతో ఇక్కడ రైతులు జీవనం సాగిస్తుంటారు. తొమ్మిది నెలల నుంచి అటెండరే అత్యవసర సమయంలో వైద్యం చేయాల్సి వస్తుంది. అదే అదనుగా భావించిన ప్రైవేట్ వైద్యులు యజమానుల నుంచి వేల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని కన్నాయిగూడెంకు డాక్టర్‌ను నియమించాలని కోరుతున్నారు

పూర్తిగా గో ఆధారిత మండలం..

మండలం పూర్తిగా గో ఆధారిత వ్యవసాయ మండలం కావడంతో మండలంలో అధికంగా పశువులు, గేదెలు, మేకలు, పెరటి కోళ్లు అధికంగా పెంచుకుంటుంటారు. మండలంలో పశువులు, గేదెలు 4500, పెంపుడు కోళ్లు సుమారు 2వేలు , మేకలు 10 వేలు ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు.

ప్రైవేట్ వైద్యులే దిక్కు..

పశువులకు నిత్యం జబ్బులు రావడంతో అందుబాటులో డాక్టర్లు లేకపోవడంతో తమ జీవాలను ప్రైవేట్ డాక్టర్లను ఆశ్రయిస్తున్నారు. ఎంత ఖర్చయినా పర్వాలేదంటూ జీవాలను రక్షించుకోవాలనే తాపత్రయంతో ప్రైవేట్ వైద్యులు రైతుల నుంచి వేల రూపాయలను లాక్కొని సొమ్ము చేసుకుంటున్నారు. వారిని కట్టడి చేయాల్సిన వారు మండలంలో కరువయ్యారని పలువురు చర్చించుకుంటున్నారు.

సొంత వైద్యం చేసుకుంటున్న రైతులు

మండలంలోని కొంత మంది మేకలు, పెరటి కోళ్లను పెంచుకునే రైతులకు డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ములుగు, ఏటూరునాగారం, కన్నాయిగూడెంలోని మెడికల్ షాపుల నుంచి ఇతర డాక్టర్ల సలహాలతో మందు డబ్బాలను కొనుక్కొంటున్నారు. తమకున్న జీవాలు జబ్బుపడినట్లయితే ముందుగా గమనించి వాటికి వైద్యం చేస్తున్నారు. ఇప్పటికైనా మండలంలో ఉన్న పశువైద్యశాలలో డాక్టర్‌ను నియమించాలని రైతులు, మండల వాసులు కోరుతున్నారు.

ప్రైవేట్‌గా చేయించుకుంటున్నం



మండలంలో ప్రభుత్వ డాక్టర్ లేకపోవడంతో ప్రైవేట్‌గా వెళ్లి వైద్యం చేయించుకుంటున్నాం. నేను 60 మేకలను పెంచుకుంటున్నా. సరైన వైద్యం అందక చాలా మేకలు జబ్బుపడి చనిపోయాయి. తప్పని పరిస్థితిలో నేనే కొన్ని సమయాల్లో మందులు కొని ఇంజక్షన్లు వేస్తాను.

– కుమ్మరి దుర్గయ్య, రైతు బుట్టాయిగూడెం

వైద్యుడిని నియమించాలి



మండలంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాము. ప్రైవేట్‌కు వెళ్లి వైద్యం చేయిస్తే చాలా డబ్బులు తీసుకుంటున్నారు. అంత డబ్బులు చెల్లించలేకపోతున్నాం. తొమ్మిది నెలల నుంచి లైవ్ స్టాక్ అసిస్టెంట్ లేక వైద్యం అందడం లేదు.

– దుర్గం రాజేష్, చింతగూడెం

అధికారుల దృష్టికి తీసుకెళ్తా..

కన్నాయిగూడెంలో అత్యవసరమని తెలిస్తే అక్కడికి వెళ్లి వైద్యం చేస్తున్నాము. నేను ఇక్కడా ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న. కన్నాయిగూడెం హాస్పిటల్ పీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ కావాలి. ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– శ్రీనివాస్, ఇన్‌చార్జ్ డాక్టర్

వైద్యశిబిరం పేరుతో వ్యాపారం

- ఎలాంటి అర్హతలు లేకుండా పరీక్షలు
- వైద్యాధికారి ప్రశ్నించడంతో శిబిరం ఎత్తివేత



వైద్య పరీక్షల కోసం వచ్చిన గ్రామస్తులు

మంగపేట : ఏటూరునాగరం ఏజెన్సీ ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా కనీస అర్హతలేని వ్యక్తులు సూర్య స్వచ్ఛంద సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి శుక్లపరీక్ష శిబిరాలను ఏర్పాటు చేస్తూ కంటి పరీక్షలు, ఆపరేషన్ల పేరుతో శిబిరాలను నిర్వహిస్తున్న విషయం సోమవారం వాడగూడెంలో వెలుగుచూసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుతో పాటు, ఏటూరునాగారంలో కంటి ఆస్పత్రి నిర్వహిస్తున్న బుక్క గోపి, మరో మహిళతో కలిసి వాడగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో సూర్య స్వచ్ఛంద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం సోమవారం ప్రైవేట్‌గా ఏర్పాటు చేశారు. ఎలాంటి అర్హత లేని గోపీ కంటి పరీక్షలు నిర్వహించి దగ్గరి, దూరపు చూపు లోపం ఉందని కొందరికి కంటి అద్దాలు ఇచ్చి రూ.800 తీసుకున్నారు. మరి కొందరికి కంటి పొరలు తొలిగించేందుకు శస్త్రచికిత్స అవసరమని ఆపరేషన్, మందుల కొరకు రూ.2 వేల వరకు ఖర్చు అవుతుందని చెప్పి వారి ఆధార్ కార్డులు తీసుకున్నారు. అదే సమయంలో చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున అదే గ్రామ పంచాయతీలో సీజనల్ వ్యాధులపై వైద్యశిబిరం ఏర్పాటు చేసేందుకు అక్కడికి వెళ్లడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తమకు సమాచారం ఇవ్వకుండా ఏకంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రైవేట్‌గా వైద్యశిబిరం నిర్వహించడం ఏంటని, ఎలాంటి పరికరాలు లేకుండా కంటి పరీక్షలను ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నించారు. దీంతో ఖంగుతిన్న నిర్వాహకులు తమకేమీ తెలియదని స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, వైద్యులు వస్తున్నారని వారి సూచన మేరకు మాత్రమే విక్రయిస్తామని చెపుతూ సామగ్రిని కారులో సర్దుకుని అక్కడ నుంచి ఉడాయించారు. కొందరు కంటి అద్దాల షాపు యజమానులు, పలు స్వచ్ఛదద సంస్థల పేరుతో కంటి పరీక్షలు, ఆపరేషన్ల పేరుతో రెండేళ్ల నుంచి ఏజెన్సీలో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

మసీద్ అధ్యక్షుడికి సన్మానం



ఏటూరునాగారం : ఏటూరునాగారం జామా మసీద్‌కు నూతనంగా ఎన్నికైన అఫ్జల్‌పాషాను సోమవారం మండల కేంద్రంలో మంత్రి సీతక్క ఘనంగా సన్మానించారు. ఇటీవల కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. మసీద్ అభివృద్ధికి దోహదపడాలని మంత్రి కోరారు. పైడాకుల అశోక్, రవీచందర్, వెంకన్న, చందు, అప్సర్ పాషా, నర్సింగరావు, వినయ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

వెంకటాపురం(ఎం) : మండల కేంద్రానికి చెందిన మెట్టు వెంకటేష్‌కు చెందిన పాడిగేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. సోమవారం ఉదయం గేదెను మందలోకి పంపేందుకు విడిచిపెట్టగా రోడ్డు ప్రక్కన ఉన్న విద్యుత్ స్థంభానికి బిగించిన ఎర్త్ వైరుకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. విద్యుత్ శాఖ తరపున నష్ట పరిహారం అందించాలని బాధితుడు కోరారు.

మొక్కజొన్న రైతులకు అండగా బీజేపీ

ములుగు రూరల్ : జిల్లాలో నకిలీ మొక్కజొన్న విత్తనాలతో మోసపోయిన రైతులకు బీజేపీ అండగా నిలిచిందని పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన రోజు కాంగ్రెస్ మంత్రులకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. రైతులకు నష్టపరిహారం అందించాలని కంపెనీలపై జాతీయ ఎస్టీ, ఎస్సీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ నకిలీ విత్తనాలు అమ్మిన కంపెనీలపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయించారని అన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడినప్పుడు రాని కాంగ్రెస్ మంత్రులు చెక్కులు అందించేందుకు వచ్చారని అన్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన రైతులకు అండగా నిలిచామని అన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు

- ప్రజలు తిరస్కరించినా బుద్ధి రాలేదు
- మంత్రి సీతక్కపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అశోక్



మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అశోక్

ములుగు రూరల్: జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ములుగు నియోజకవర్గాన్ని, పేదలను పట్టించుకోని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, నియోజకవర్గంలో ఓటమి పాలైన నాగజ్యోతిలు మంత్రి సీతక్కపై ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు తిరస్కరించినా వారికి బుద్ధి రాలేదని అన్నారు. మంత్రి సీతక్క పై బీఆర్ఎస్ నాయకులు అనుచిత వాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ఎండి చాంద్‌పాషా, భిక్షపతి, రవి యాదవ్, జయపాల్‌రెడ్డి, అశోక్, కుమార్, రేవంత్‌యాదవ్, పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వంపై కుట్రలు మానుకోవాలి

ములుగు రూరల్ : ప్రజాప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకుల కుట్రలను మానుకోవాలని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గోవిందరావుపేట: బీఆర్ఎస్ నాయకులు ప్రజాప్రభుత్వం పై చేస్తున్న కుట్రలు మానుకోవాలని కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు చింత క్రాంతి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పార్టీ మండల యూత్ నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అనిల్, కిరణ్, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, మణిచంద్, గణేష్, సురేష్, తాటి శ్రీను పాల్గొన్నారు.

భారీగా పట్టుబడిన నిషేధిత గుట్కాలు



జిల్లాకేంద్రంలో గోదాంల్లో నిల్వచేసిన నిషేధిత గుట్కా, అంబర్‌లు

ములుగు రూరల్: జిల్లాకేంద్రంలో భారీగా గుట్కా, అంబర్ ప్యాకెట్లు దిగుమతి అవుతున్న విషయాన్ని బీజేపీ నాయకులు పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం రాత్రి గూడ్స్ వాహనంలో తరలిస్తూ గోదాంల్లో నిల్వ చేసి అమ్మకాలు చేపడుతున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై రామకృష్ణ నిషేధిత గుట్కా, అంబర్ ప్యాకెట్లను పరిశీలించారు. గుట్కా, అంబర్ ప్యాకెట్లను సీజ్ చేయాలని బీజేపీ నాయకులు కొత్త సురేందర్ డిమాండ్ చేశారు. పట్టుబడిన నిషేదిత గుట్కా, అంబర్‌ల విలువ సుమారు రూ.8 లక్షలు ఉంటుందని తెలిపారు. గుట్కా, అంబర్‌లపై నిషేధ ఆజ్ఞలు ఉన్నట్లయితే సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

నూతన మోడల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు

- ప్రారంభించిన మంత్రి సీతక్క



పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క



మంత్రి కాన్వాయ్‌కి అడ్డు రాకుండా గ్రామస్తులను అడ్డుకుంటున్న రోప్ పార్టీ పోలీసులు

మంగపేట : రూ 2.50 కోట్లతో అధునాతన హంగులతో నిర్మించిన నూతన పోలీస్ స్టేషన్‌ను పంచాయతీరాజ్, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క సోమవారం సాయంత్రం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రి సీతక్కకు ఎస్సై టీవీఆర్ సూరి ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ శబరీష్, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ శ్రీనివాస్ పూలబొకేను అందజేసి ఆహ్వానించారు. నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్కను ఎస్పీ శబరీష్ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్సై సూరీ, ఎస్పీ శబరీష్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయను సీతక్క శాలువాతో సత్కరించారు. స్టేషన్‌లో విధులు నిర్వహించే పోలీసులకు, వివిధ సమస్యల పరిష్కారం, ఫిర్యాదుల కోసం స్టేషన్‌కు వచ్చే వారికి సైతం ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. పోలీసులు నేరాలను నియంత్రిస్తు శాంతి భద్రతలను కాపాడాలని సూచించారు. అనంతరం ఎస్పీ, ఏఎస్పీ, సీఐ ఎస్సైతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో మొక్కను నాటారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కమలాపురం టీడీపీ కాలనీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ లావుడ్యా శ్యామ్‌లాల్ ఆదివారం మృతి చెందగా ఆయన కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. అలాగే గ్రామంలో ఇటీవల మృతి చెందిన భాస్కర్ కుటుంబాన్ని పరామర్శించారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం నిరసన

మండలంలోని కమలాపురంలోని ఎస్సీ కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకుడు గాజర్ల రాజు ఆధ్వర్యంలో దళితులు, గ్రామస్తులు ఇందిరమ్మ ఇళ్ల కోసం మంత్రి సీతక్క కాన్వాయిని అడ్డుకుని నిరసన తెలిపారు. దీంతో కాన్వాయ్‌ని ఆపి ఇళ్ల విషయంపై మంత్రి వారికి సర్ది చెప్పారు. పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సం ముగిసిన తర్వాత మంత్రి తిరిగి వెళ్లే క్రమంలో పోలీస్ స్టేషన్ ఎదుట మండల కేంద్రంలోని పాదుమూరు, నర్సింహాసాగర్, పూరేడుపల్లి, తదితర గ్రామాలకు చెందిన వారు మంత్రిని ఆపి ఇందిరమ్మ ఇళ్లు, కరెంటు, రోడ్లు సౌకర్యం తరదిర సమస్యలపై వినతిపత్రాలను అందచేశారు. మంత్రి ప్రతి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం ఏటూరునాగారం వెళ్తున్న క్రమంలో కమలాపురం ఎస్సీ కాలనీ దళితులు, కాంగ్రెస్ కార్యకర్తలు మంత్రిని ఆపేందుకు ప్రయత్నించడంతో రూప్ పార్టీ పోలీసులు వారిని అడ్డుకున్నారు. కమలాపురంలో కొందరు నాయకులు అర్హులైన నిరుపేదలకు కాకుండా డబ్బులు ఇచ్చినవారికి ఇళ్లు మంజూరీ చేయించారని విషయంలో తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకోకుండా పోలీసులు అడ్డుకున్నారని వాపోయారు.

కొంగాలలో ఇంటింటి సర్వే



రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి మహేందర్

వాజేడు : మండలంలోని కొంగాల గ్రామంలో వాజేడు వైద్యాధికారి కొమరం మహేందర్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రత్యేకంగా జ్వరాలపై ఆరా తీయడంతో పాటు కొందరి నుంచి రక్త పూతలను సేకరించారు. ఇంటి పరిసరాల్లో టైర్లు, ఇతర వస్తువుల్లో ఉన్న నీటిని పారబోయడంతో పాటు నీరు నిల్వ ఉన్న చోట టీమోపాస్ మందును పోశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందించే భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట హెల్త్ సూపర్ వైజర్ కోటిరెడ్డి, వెంకట రమణ, చాయాదేవి, శేఖర్, ఆశ వర్కర్ తదితరులున్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



ములుగు రూరల్ : జెండావిష్కరించి నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



ఏటూరునాగారంలో..



వెంకటాపురం(ఎం)లో..

సాక్షి, నెట్‌వర్క్ : జిల్లా కేంద్రంతో పాటు ఏటూరునాగారం, వెంకటాపురం(ఎం) మండలాల్లో ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దండోరా జెండాను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. మంద కృష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. పలువురు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుందని అన్నారు. ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, ఉద్యమానికి సహకరించిన కుల సంఘ నాయకులను, ఉద్యోగ సంఘాల నాయకులను శాలువాతో సత్కరించారు.

ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న నలవాల స్వామి

ములుగు రూరల్: ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలవాల స్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులకు 12 నుంచి 15 రోజులు డ్యూటీలు వేస్తున్నారన్నారు. పెయిడ్ హాలీడేస్ కల్పించడం లేదని తెలిపారు. జూలై 14న నిర్వహించ తలపెట్టిన ఆర్టిజన్ కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రేపు ఎన్‌పీడీసీఎల్ కార్యాలయం ఎదుట లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ప్రతీ సబ్‌స్టేషన్‌లో 4 ప్లస్ 1 ఆపరేటర్లను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో జయరాజు, సాయిబాబా, వెంకటరాజు, కోటి, రాజేందర్, అశోక్, మహేందర్, మధుసూదన్, విజయ్, గోవర్ధన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిరంకుశ పాలనను ఎండగట్టాలి



ఏటూరునాగారం : బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు,నేతలు

సాక్షి, నెట్‌వర్క్ : ప్రభుత్వ నిరంకుశ పాలనను ఎండగట్టాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహా రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఖరి, మంత్రి సీతక్క దురంకార పాలనకు వ్యతిరేకంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా ములుగు జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. లక్ష్మీనర్సింహరావు ములుగుకు వెళ్లకుండా స్థానిక సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్‌లు బీఆర్ఎస్ నాయకులను హౌజ్ అరెస్టు చేశారు. అనంతరం బలవంతంగా ఏటూరునాగారంలో బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఏటూరునాగారం బస్టాండ్‌లో ధర్నా చేపట్టారు. జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా నిరసన కార్యక్ర మానికి తరలివెళ్తారని భావించిన బీఆర్ఎస్ నా యకులను పోలీసులు అదుపులోకి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అరెస్టయిన వారిలో పార్టీ జిల్లా, మండల నాయకులు ఉన్నారు.



వాజేడు: పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు



గోవిందరావుపేటలో..



వెంకటాపురం(కె): పోలీస్‌స్టేషన్‌లో..